2వ పాఠం ఏప్రిల్ 3-9

# ప్రథమ నిబంధన

**సబ్బాతు మధ్యాహ్నము** **ఏప్రిల్ 3**

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఆది 9:15; యెషయా 54:9; ఆది 12:1-3; గలతి 3:6-9, 29; నిర్గమ 6:1-8, యిర్మీయా 31:33,34.**

**కంఠతవచనం : "కాగా మీరు నా మాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచిన యెడల మీరు సమస్త దేశ జనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు" (నిర్గమ 19:5).**

మన మొదటి తల్లిదండ్రుల యొక్క పాపము వలన మానవజాతి పతనమైనదనే విషయాన్ని గతవారము పాఠములో చదువుకొనియున్నాము. ఈ త్రిమాసమంతటిలోను మనము ప్రాథమిక నిబంధనలను గూర్చి, యేసు యొక్క రక్తము ద్వారా కల్వరి యొద్ద ఖాయపర్చబడిన నిబంధనను గూర్చి, మన ప్రభువుతో క్రైస్తవులముగా ఆ నిబంధనలోనికి ఏవిధముగా ప్రవేశించామనే విషయాలను చదువనైయుండగా ఈ వారము మాత్రము ఒక్కొక్క రోజు ఒక్కొక్క నిబంధనను గూర్చి సంక్షిప్తముగా తెలుసుకొనబోవుచున్నాము.

నోవహు మరియు అతని కుటుంబమును వినాశనం నుండి కాపాడుటకు అతనితో దేవుడు చేసిన నిబంధనతో ఆరంభించి, మనందరి కొరకు వాగ్దానముతో నిండిన అబ్రహాముతో చేసిన విలువైన నిబంధనను గూర్చి అటు తరువాత సీనాయి యొద్ద చేసిన నిబంధనలో ఏ ప్రాముఖ్యమైన విషయాలు ప్రకటింపబడెనో వాటిని గూర్చి చివరిగా అన్ని నిబంధనలు ఏ నిబంధనవైపు చూపిస్తున్నాయో, ఆ నూతన నిబంధనను గూర్చి ఈ వారము పరిశీలించనైయున్నాము. వీటన్నిటిని గురించి లోతైన అధ్యయనము రాబోవు వారాలలో చేయబోవుచున్నాము. ఈ వారము వాటిని గూర్చి కేవలం ఒక అవగాహన కలుగుటకు పరిశీలించబోవుచున్నాము.

**ఈ వారం పాఠములోని ముఖ్యాంశాలు**

నిబంధన అనే మాటకు అర్థం ఏమిటి? ఏ విషయాలతో నిబంధన ఏర్పడుతుంది? నోవహుతో దేవుడు చేసిన నిబంధన ఏమిటి? అబ్రహాముతో చేసిన నిబంధన ఏమిటి? అబ్రహాముతో చేసిన నిబంధనలో ఏ నిరీక్షణను అందులో చూడగలము? మానవుని పక్షమున చూస్తే నిబంధనలో విశ్వాసము మరియు క్రియలు ఏవిధముగా పనిచేస్తాయి? నిబంధన కేవలం ఒక వ్యవహారమువంటిదేనా? లేక దానిలో ఏమైనా వివేకము వున్నదా? "నూతన నిబంధన యొక్క సారాంశం" ఏమిటి?

– ఏప్రిల్ 10, సబ్బాతు దినమున ఈ వారము యొక్క పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

**ఆదివారం** **ఏప్రిల్ 4**

## నిబంధనలోని మౌలిక విషయాలు

**"నాకును, నీకును మధ్య నా నిబంధనను నియమించి నిన్ను అత్యధికముగా అభివృద్ధి పొందించెదనని అతనితో చెప్పెను" (ఆది 17:2).**

"నిబంధన లేక కవనెంట్" అని తర్జుమా చేయబడిన హీబ్రూ పదము 'బెరిత్' అను పదము పాతనిబంధనలో 287 సార్లు కనిపిస్తుంది. దానిని టెస్టమెంట్ (నిబంధన) లేక లాస్ట్‌విల్ (చివరి కోరిక) అని కూడా ఆ పదాన్ని తర్జుమా చేయవచ్చును. ఆ మాట యొక్క మూలాలను గురించి స్పష్టముగా ఎవరికి తెలియదు. అయితే దానిలో రెండు భాగాలు జత చేయబడ్డాయి. ఒకటి మానవునికి మరియు మానవునికి మధ్య జరిగేది.

రెండవది మానవునికి దేవునికి మధ్య జరిగే ఒప్పందము. మతపరముగా చూచినచో అందరికి ఉపయోగపడుతుందనే భావముతో అది ఒక రూపకమైయున్నది" – జే ఆర్థర్ థామ్సన్ కవనెంట్. ది ఇంటర్నేషనల్ స్టాండర్డు బైబిలు ఎన్‌సైక్లోపీడియా, రివైజ్డ్ ఎడిషన్ (గ్రాండ్ రాపిడ్సు ఎమ్ఐ : విల్యంబి ఎర్డుమన్సు పబ్లిషింగ్ కంపెని (1979) సంపుటి 1, పుట 790.

వివాహములో చేసే నిబంధనవలె బైబిలు నిబంధన ఒక బాంధవ్యమును మరియు ఒక సర్దుబాటును వివరిస్తుంది. ఒక సర్దుబాటు విషయంలో బైబిలు నిబంధన కొన్ని మౌలిక విషయాలు కలిగియుంటుంది.

1. దేవుడు ప్రమాణ పూర్వకముగా నిబంధన వాగ్దానములను ధృవీకరించెను (గలతీ 3:16; హెబ్రీ 6:13,17)
2. పది యాజ్ఞలలో వివరించినట్లు దేవుని యొక్క చిత్తానికి విధేయత చూపవలసిన బాధ్యతను నిబంధన ద్వారా విధించెను (ద్వితి 4:13)
3. దేవుని యొక్క నిబంధనకున్న బాధ్యత చివరికి క్రీస్తు ద్వారా మరియు రక్షణ ప్రణాళిక ద్వారా నెరవేరనైయుంది (యెషయా 42:1,6).

**పైన పేర్కొనబడిన మూడు విషయాలను (దేవుని యొక్క వాగ్దానములు, మన విధేయత మరియు రక్షణ ప్రణాళిక) పరిశీలించండి. నీవు ప్రభువుతో నడిచేటప్పుడు ఈ అంశములు పనిచేయుచున్నట్లు నీవు ఏవిధముగా చూడగలవు? నేడు నీ జీవితములో ఆ అంశములు ఏవిధముగా స్పష్టము చేయబడుచున్నావో వ్రాతపూర్వకముగా వివరించుము.**

పాతనిబంధన గ్రంథములో బల్యర్పణల విధానమును ఒక మాదిరిగా చూపి ప్రజలకు రక్షణ ప్రణాళికనంతటిని బోధించెను. ఇవ్వబడిన గురుతుల ద్వారా పితరులు మరియు ఇశ్రాయేలీయులు రాబోవు విమోచకుని యందు విశ్వాసము కలిగియుండుటకు నేర్చుకున్నారు. బల్యర్పణకు సంబంధించిన విధులు మరియు సంస్కారములు పాటించుట ద్వారా పశ్చాత్తాపము చెందినవారు పాపక్షమాపణను కనుగొని అపరాధ భావమునుండి విడుదల పొందేవారు.

ఆవిధముగా వారు నిబంధన దీవెనలను నిలుపుకొనుచు, ఆధ్యాత్మికముగా ఎదుగుచు, వారి జీవితములో దేవుని యొక్క స్వరూపమును తిరిగి పొందుటకు అవకాశము లభించేది.

**ప్రజలమధ్య నిబంధనలు చేసుకొనుట అలవాటుగా ఉన్నప్పటికి, నిబంధనకు హీబ్రూ పదమైన 'బెరిత్' ప్రకారము దేవునికి మానవులకు మధ్యనున్న బాంధవ్యము ద్వారా దేవుడు ఎవరైయున్నాడు? మనమేమైయున్నామని తెలుసుకొనే అవకాశమున్నది. దేవునితో చేసుకున్న నిబంధన ద్వారా ఎట్టి బాంధవ్యమును చూపిస్తుంది?**

సోమవారం ఏప్రిల్ 5

## నోవహుతో చేసిన నిబంధన

**"అయితే నీతో నా నిబంధన స్థిరపరచుదును. నీవును నీతో కూడ నీ కుమారులును, నీ భార్యయు, నీ కోడండ్రును ఆ ఓడలో ప్రవేశింపవలెను" (ఆది 6:18).**

పైన పేర్కొనబడిన వాక్యములో "నిబంధన" అనే మాట బైబిలులోనే మొట్టమొదటి సారిగా కనిపించింది. ఈ సందర్భముగా నోవహుతో దేవుడు మాట్లాడుచూ పాపము విస్తరించుట వలన ఈ భూమిని నాశనము చేయాలనుకొనుచున్నట్లు తన తీర్మానమును గూర్చి చెప్పెను. జల ప్రవాహముతో భూమినంతటిని నాశనము చేయాలని దేవుడు సంకల్పించినపుడు తాను చేసిన సృష్టినంతటిని విడిచి పెట్టుటకు ఆయన ఇష్టపడుట లేదు. మానవులు పాపము వలన పతనమైపోయినను వారందరిని నాశనము చేయకుండా మొట్టమొదటిసారి నిబంధన బాంధవ్యమును కొనసాగించుటకు ఆయన ముందుకు వచ్చెను. "నేను" అని సంబోధించుకొనిన దేవుడు నోవహుకు భద్రతగా నిలిచాడు. విధేయత చూపించుట ద్వారా దేవునితో వారికున్న బాంధవ్యమును కొనసాగించారు కాబట్టి నిబంధనను గైకొనే దేవుడు ఆ కుటుంబ సభ్యులనందరిని కాపాడుదునని వాగ్దానము చేసెను.

**నోవహుతో చేసిన నిబంధన ఏక పక్షముగా జరిగినదా? ఒక పక్షమునకు మాత్రమే చెందినవారితో నిబంధన చేసుకొనడం సాధ్యమయ్యేది కాదని గుర్తుంచుకోవాలి. నోవహు తనవంతుగా నిలబెట్టుకొనవలసినది ఆ నిబంధనలో ఏమైనా ఉందా? ఈ ప్రశ్నలకు మన యొద్ద ఉన్న జవాబులు ఏమిటి?**

-----------------------------------------------

-----------------------------------------------

జల ప్రళయము ద్వారా ఈ లోకమంతటిని నాశనము చేయబోవుచున్నట్లు దేవుడు ప్రకటించినను, ఆ ఉపద్రవము నుండి నోవహును, అతని కుటుంబమును కాపాడుదునని ఆయన వారికి వాగ్దానము చేసెను. అయితే దేవుడు తనవంతుగా తన వాగ్దానమును నెరవేర్చినచో నోవహు ఏమి చేసినను లోకముతో పాటు వారు కూడా తుడిచి పెట్టుకొని పోవలసినవారే.

నోవహుతో ఒక నిబంధన చేయుదును అని దేవుడు చెప్పెను. దేవుడు ఏమి చెప్పాడో దానిని గౌరవించే ఉద్దేశము ఆయనకున్నట్లు ఆయన చెప్పిన దానిలోనే ఉంది. వెర్రి ఆలోచనలతో చేసిన నిబంధన కాదది. ఈ లోకము ఒక భయంకరమైన జలప్రళయము ద్వారా నాశనము

కాబోవుచున్నది. నేను ఏమి చేస్తానో అది ప్రక్కన పెట్టి నీవు మాత్రము ఈ విధముగా చేయి అని నోవహుతో చెప్పియున్న యెడల అందులో ఎటువంటి ఆదరణ మరియు బాధ్యత ఉండెడిది కాదు. 'నిబంధన' అనే మాటలో ఆదరణతో పాటు నెరవేర్చుదును అనే వాగ్దానము కూడా లీనమైయుంటుంది.

**నోవహు కాలములో వచ్చిన జలప్రళయము ప్రపంచ వ్యాప్తముగా కాకుండా ఏదో ఒక ప్రాంతమునకే పరిమితమైయున్నదని కొందరు వాదిస్తున్నారు. అదే నిజమైతే నిత్యము వేర్వేరు ప్రాంతాలలో వచ్చుచున్న వరదల సమయములో దేవుడు తాను ఆది 9:15లో (యెష 54:9) చేసిన నిబంధనను ఆయనే మీరుచున్నాడనుకోవాలా? నిజానికి అప్పటి నుండి నేటి వరకు ప్రపంచ వ్యాప్తమైన జలప్రళయము రాకపోవుట వలన దేవుని యొక్క నిబంధన వాగ్దానముకున్న ప్రమాణత్వమును నిరూపించుచున్నది. ఆయన వాగ్దానములను నమ్ముటకు ఈ దృష్టాంతము మనకేమి చెప్పుచున్నది?**

**మంగళవారం** **ఏప్రిల్ 6**

## అబ్రాముతో చేసిన నిబందన

**'నిన్ను ఆశీర్వదించు వారిని ఆశీర్వదించెదను. నిన్ను దూషించు వానిని శపించెదను భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును' అని అబ్రాముతో అనగా (ఆది 12:1-3 చదువుడి) అబ్రాముతో దేవుడు చేసిన ప్రత్యేకమైన వాగ్దానములను గూర్చి వ్రాయండి.**

-------------------------------------------

-------------------------------------------

**అబ్రాముకు దేవుడు కొన్ని వాగ్దానములను చేస్తూ "భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదింపబడును" అని చెప్పెను (ఆది 12:3) దాని అర్థము ఏమిటి? అబ్రామునందు భూమి యొక్క సమస్త వంశములు ఏవిధముగా ఆశీర్వదింపబడును? గలతి 3:6-9 చూడుడి. మెస్సీయాయైన యేసును గూర్చిన వాగ్దానమును గూర్చి ముందుగా చేసిన వాగ్దానములో మీరేవిధముగా చూడగలరు? గలతీ 3:29 చూడుడి.**

-------------------------------------------

-------------------------------------------

అబ్రాముతో నిబంధన చేస్తాను అని దేవుడు మాట్లాడకముందే అతనితో ఒక సన్నిహితమైన మరియు దీర్ఘకాలము నిలిచియుండు బాంధవ్యమును గురించి బయలుపర్చడాన్ని ముందుగా ఇందులో చూస్తున్నాము. దీని తరువాత దేవుడు అబ్రాముతో చేయబోవు నిబంధనకు సంబంధించిన సూచనలను వేరుగా చూడవచ్చును (ఆది 15:4-21; 7:1-14) నిబంధన అమలులోనికి రావడానికి ముందుగా గొప్ప ప్రాధాన్యత కలిగిన దైవ మానవ బాంధవ్యమును దేవుడు అబ్రాముతో ఏర్పరచుకున్నాడు. 'నేను చేస్తాను' అని ఆది

12:1-3లో అనేకసార్లు చెప్పుట ద్వారా, ఆయన వాగ్దానములో ఉన్న లోతు మరియు గొప్పదనము కనిపిస్తున్నది.

అంతమాత్రమే కాకుండా 'నేను చూపించు దేశమునకు వెళ్ళుము' అని పరీక్షతో కూడిన ఒక ఆజ్ఞను అబ్రాముకు దేవుడు ఇచ్చెను. వాగ్దానము చేయబడిన ఆశీర్వాదములను పొందుట కొరకే కాదు గాని కేవలము దేవునితో అతనికున్న ప్రేమతో కూడిన బాంధవ్యమును బట్టి "విశ్వాసముతో దేవుని యొక్క ఆజ్ఞకు విధేయత చూపాడు" (హెబ్రి 11:8).

దేవుని మీద మరియు ఆయన చేసిన వాగ్దానముల మీద అబ్రాముకు నమ్మకము మరియు విశ్వాసము లేనియెడల తన పితరుల దేశమును తన స్వజనులను (కుటుంబమును) విడిచి తెలియని ప్రదేశమునకు వెళ్ళి యుండెడివాడు కాదు. అబ్రాము తన విధేయత ద్వారా దేవుని యెడల అతనికున్న విశ్వాసమును మనుష్యులకు మరియు దేవదూతలకు బహిరంగపరచెను. "ఆయనే (దేవుడు) మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" (1యోహాను 4:19) అనే నియమమును దైవమానవ బాంధవ్యములో చూస్తున్నాము.

**ఆది 15:6 చదువుడి. అన్ని నిబంధన వాగ్దానములకు ఇది మూలమని ఏవిధముగా చూపిస్తుంది?**

**బుధవారం** **ఏప్రిల్ 7**

## మోషేతో చేసిన నిబంధన

**నిర్గమ 6:1-8 చదివి ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.**

**1. ఏ నిబంధనను గూర్చి దేవుడు మాట్లాడాడు? (ఆది 12:1-3)**

------------------------------------------------

**2. దేవుని వైపు నుండి చూచినపుడు నిర్గమము (విడిచి వెళ్ళుట) ఏవిధముగా నిబంధన వాగ్దానాల యొక్క నెరవేర్పవుతుంది?**

------------------------------------------------

**3. ఇక్కడ ప్రజలకు చేసిన వాగ్దానము జలప్రళయమునకు ముందు నోవహుకు చేసిన వాగ్దానము ఈ రెండింటి మధ్య ఉన్న సరిపోలే విషయము ఏమిటి?**

------------------------------------------------

ఇశ్రాయేలు జనాంగము నిర్గమము తరువాత వారు బానిసత్వము నుండి విమోచింపబడిన సందర్భమునకు సూచనగాను మరియు వారి పాపములు క్షమింపబడినవనియు పాప ప్రాయశ్చిత్తార్థమై దేవుడు చేయనున్న బలియాగమునకు సంబంధించిన ఏర్పాట్లకు సూచనగాను సీనాయి యొద్ద వారికి ఒక నిబంధన చేయబడెను.

అనేక విషయాలలో ఈ నిబంధన అబ్రహాముతో చేసిన నిబంధనలోని విషయాలను పునరుద్ఘాటించుట (తిరిగి చెప్పుట) జరిగింది.

1. ఈ నిబంధన ద్వారా దేవుడు తన ప్రజలతో ఒక ప్రత్యేక బాంధవ్యము కలిగి యున్నట్లు చూపిస్తుంది. ఆది 17:7,8తో నిర్గమ 19:5,6ను పోల్చి చదువుడి.

2. వారు గొప్ప దేశమైయుందురు (ఆది 12:2తో నిర్గమ 19:6ను పోల్చిచూడుడి).

3. విధేయత కలిగి యుండాలి (ఆది 17:9–14 మరియు ఆది 22:16–18తో నిర్గమ 19:5ని పోల్చి చూడుడు).

ఇక్కడ సూచించబడిన క్రమమును గమనించండి : ఇశ్రాయేలును దేవుడు ముందుగా రక్షిస్తాడు. అటు తరువాత వారు గైకొనవలసినదని తన ధర్మశాస్త్రమును ఇస్తాడు. సువార్త కాలములో కూడా అదే క్రమమును అనుసరించడం జరిగింది. పాపమునుండి క్రీస్తు మనలను రక్షిస్తాడు (యోహాను 1:29; 1కొరింథి 15:3; గలతి 1:4 చూడుడి) తరువాత ఆయన ధర్మశాస్త్రమును మనలో జీవింపచేస్తాడు. గలతి 2:20; రోమా 4:25; 8:1–3; 1పేతురు 2:24) – ఎస్‌డి ఎ బైబిలు వ్యాఖ్యానము సంపుటి 1, పుట 6021.

**నిర్గమ 6:7 చదువుడి. 'మిమ్ములను నాకు ప్రజలనుగా చేర్చుకొని మీకు దేవుడనైయుందును' అనే ఈ మొదటి భాగములో ఉన్న ఒక విషయమేమిటి? అందులో ఉన్న ప్రధానమైన విషయమేమిటంటే వారు దేవునికి చెందిన వారవుతారు మరియు దేవుడు వారికి చెందిన వాడవుతాడు. ఒక ప్రత్యేకమైన బాంధవ్యవముతో వారు దేవునితో ఉండాలని ఆయన కోరుకొనుటయేగాక ఆయన కూడా వారితో అదే తరహా బాంధవ్యమును కలిగియుంటానని వారికి సెలవిచ్చుచున్నాడు. ప్రభువైన దేవుడు నేడు మనతో కూడా అటువంటి బాంధవ్యమును కలిగియుండాలని కోరుచున్నాడా? నిర్గమ 6:7లో మొదటి భాగము ప్రకారము ప్రభువుతో నీకు బాంధవ్యము వున్నదా? లేక నీవు కేవలము సంఘ సభ్యత్వము మాత్రమే కలిగియున్నావా? ఈ ప్రశ్నలోని మొదటి భాగమునకు నీ జవాబు 'అవును' అయినట్లయితే కారణములను తెల్పుము.**

గురువారం ఏప్రిల్ 8

## క్రొత్తనిబంధన (యిర్మియా 31:31-33)

"క్రొత్త నిబంధనను" గురించి పాతనిబంధన గ్రంథములో మొట్టమొదటగా చెప్పబడిన వాక్యము విని దేశ బహిష్కరణ ముగిసిన తరువాత ఇశ్రాయేలు వారి స్వదేశమునకు తిరిగి వచ్చే సందర్భములో వారు దేవుని నుండి పొందే ఆశీర్వాదములను గురించి ఇది మాట్లాడుచున్నది.

మిగిలిన సంఘటనలవలెనె మరొకసారి దేవుడే నిబందనను ఆరంభించి ఆయన కృప చొప్పున దానిని నెరవేర్చువాడునైయున్నాడు. ఆ వాక్యాలలో వాడబడిన భాష ప్రకారము దేవుడు తన ప్రజలకు ఒక భర్తగా ఉన్నట్లు మాట్లాడుచున్నాడు. వారి మనస్సులలో ఆయన ధర్మవిధిని వ్రాస్తాననియు, వారికి ఆయన దేవుడైయుంటాడనియు వారు ఆయన ప్రజలై యుందురనియు అబ్రహాము నిబంధనలోని మాటలను జ్ఞాపకము చేస్తున్నాడు. కాబట్టి

పూర్వకాలములో ఉన్నట్టే నిబంధన అనునది నేటి న్యాయశాస్త్రము అంగీకరించినట్లు అదొక న్యాయబద్ధమైన ఒప్పందముగా పరిగణింపబడుటయే గాక, దానికి మించిన విలువైన విషయాలు దానిలో ఉన్నట్లు భావించవచ్చును.

**యిర్మీయా 31:33ను నిర్గమ 6:7తో పోల్చి చదివినచో ఇశ్రాయేలుతో దేవుడు చేసిన నిబంధనను చూడగలము. ఆ నిబంధనలో బయలుపడిన విషయము ఏమిటి? తన ప్రజలతో దేవుడు ఏమైయుండాలని కోరుచున్నాడు?**

**యిర్మీయా 31:34 ను యోహాను 17:3తో ఏమి చెప్పబడిందో పోల్చి చూడుడి. బాంధవ్యమును నిర్మించుటకు ఏవిషయాన్ని పునాదిగా ప్రభువైన దేవుడు ప్రధానముగా ఉపయోగించాడు?**

-----------------------------------------------

-----------------------------------------------

దానికన్నా ముందు చేసిన నిబంధనలలో ఉన్న కృప మరియు విధేయత అనే విషయాలను యిర్మీయా 31:31-34లో కూడా చూడవచ్చును. దేవుడు వారి పాపములను క్షమించును. వారితో దేవుడు బాంధవ్యములోనికి ప్రవేశించును. మరియు వారి జీవితములను దేవుడు తన కృపతో నింపును. దాని ఫలితముగా ప్రజలు ఏదో ఒక యంత్రమువలె, లేక అర్థము లేకుండా వల్లించునట్లుగా కాకుండా ఆయనను వారు ఎరిగియున్నారు కాబట్టి ఆయనను ప్రేమించుచున్నారు కాబట్టి, ఆయనను సేవించాలనే కోరిక కలిగి యున్నారు కాబట్టి వారు దేవునికి విధేయులై జీవిస్తారు. అప్పుడు తన ప్రజలలో ప్రభువు దేనినైతే వెదకుచున్నాడో ఆ సారమును నిబంధన బాంధవ్యమును ద్వారా దాని వశమవుతుంది.

**మనస్సులలో ధర్మవిధులను వ్రాయుదును అనే మాటలను నీవు ఏవిధముగా అర్థము చేసుకుంటావు? అది మన హృదయాలోచనలను బట్టి ఆ ధర్మ విధి యొక్క భావము వివరించబడుతుంది మరియు అన్వయించబడుతుందని దాని అర్థమైయున్నదా? లేక వేరే విషయమేదైనా ఉందా? వేరే విషయమేదైనా ఉంటే అదేమిటి?**

**శుక్రవారం** **ఏప్రిల్ 9**

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్ 'పితరులు మరియు ప్రవక్తలు' నుండి 'కానానులో అబ్రహాము' పుటలు 132-138; 'ప్రవక్తలు మరియు రాజులు' నుండి వారికి దేవుని ప్రవక్తలు సహాయము చేయుచున్నారు 'పుటలు 569-571' చదువుడి.

సేవ కొరకు కాడిని సిద్దము చేసేది దేవుని యొక్క ధర్మశాస్త్రము, ఏదెనులో బయలుపర్చబడిన గొప్ప ప్రేమ చట్టము, సీనాయి మీద ప్రకటించిన దేవుని ధర్మశాస్త్రము మనస్సులలో లేక హృదయాల మీద వ్రాయబడిన క్రొత్త నిబంధన దేవుని చిత్తమునకు మానవ పనివాడిని సిద్దము చేస్తాయి. మన సొంత ఇష్ట ప్రకారము నడుచుకొనుటకు, మన

చిత్తము ఎక్కడికి నడిపిస్తే అక్కడికి వెళ్ళగలిగే నిర్ణయాన్ని మనకు విడిచి పెట్టినట్లయితే మనము సాతాను యొక్క శ్రేణులకు చిక్కుకొని అతని యొక్క గుణము, స్వభావమును ధరించుకుంటాము. అందుచేతనే దేవుడు ఉన్నతమైన, ఔదార్యముగల, ఔన్నత్యముగల తన చిత్తము యొక్క హద్దులలో నిలిపియుంచును. సహనముతోను మరియు జ్ఞానయుక్తముగా సేవా విధులను మనము అంగీకరించాలని ఆయన కోరుచున్నాడు. మానవునిగా సేవా కాడిని క్రీస్తే స్వయముగా మోసియున్నాడు. కీర్తన 40:8; యోహాను 6:38 చదువుడి. ఎలెన్ జి వైట్, యుగయుగాల అభీష్టము, పుటలు 329:330

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. దేవుడు నోవహుతోను, అబ్రాముతోను, మోషేతోను మరియు మనతోను చేసిన నిబంధన ఆయన ఆదాముతో చేసిన నిబంధనకు కొనసాగింపుగా ఉన్నదా లేక ఏదైనా క్రొత్తదా? ఆది 3:15; 22:18 మరియు గలతి 3:8, 16తో పోల్చి చూడుడి.
2. నిబంధన అనునది వ్యక్తిగతమైన, బంధుత్వ పరమైనదిగా ఎందుకంత ప్రాధాన్యత కలిగియున్నది?
3. ఒక నిబంధనకు వివాహము ఏవిధముగా మంచి సాదృశ్యము? నిబంధన గూర్చి వివరించేటప్పుడు వివాహ సాదృశ్యము ఏవిధంగా అసంపూర్ణము?

## పాఠము యొక్క సారాంశము

మన ఆది తల్లిదండ్రులతో ఏర్పాటు చేయబడిన మానవ కుటుంబమునకు ఆరంభమునందు సృష్టికర్తతో ఉన్న బాంధవ్యము పాపము ప్రవేశించగానే చెడిపోయినది. ఇపుడు ఒక నిబంధన ద్వారా ప్రేమతో కూడిన బాంధవ్యమును తిరిగి నెలకొల్పాలని దేవుడు సంకల్పించియున్నాడు. దేవునికి మరియు మనకును మధ్య విడదీయరాని బాంధవ్యమును సూచించేదిగాను, మనలను రక్షించుటకు ఏర్పాటు చేయబడినదై సృష్టికర్తతో సామరస్యమును నెలకొల్పేదిగా ఈ నిబంధన యొక్క ప్రాధాన్యతైయున్నది. మన యెడల దేవునికున్న గొప్ప ప్రేమను బట్టి ఆయనే స్వయముగా ప్రేరేపించబడి నిబంధన బాంధవ్యమునకు ప్రారంభికుడయ్యాడు. ఆయనతో కలిసి జీవించుటకు మనలను కృపతో కూడిన వాగ్దానములతోను మరియు కృపా కార్యములతోను ప్రేమగా ఆహ్వానించుచున్నాడు.

❋✶❋